www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 24 | మే | 2026
పేజీలు : 8

## వరిగడ్డికి పెట్టిన నిప్పుతో పామాయిల్ తోట దగ్ధం

-రైతులకు భారీ ఆస్తి నష్టం

ప్రజాపక్షం/ఏన్కూరు: మండల కేంద్రం ఏన్కూరులో గుర్తు తెలియని వ్యక్తులు వరిగడ్డికి నిప్పు పెట్టడంతో సమీపంలోని పామాయిల్ తోటకు మంటలు వ్యాపించి మొక్కలు దగ్ధమైన ఘటన చోటు చేసుకుంది. ఏన్కూరుకు చెందిన రైతు మేడా శ్రీనివాసరావు రేపల్లెవాడ రోడ్డులోని తన పొలంలో పామాయిల్ తోటను సాగు చేస్తున్నారు. పామాయిల్ తోట చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. సమీపంలోని వరి పొలాల్లో కోసిన వరి గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి పామాయిల్ మొక్కలకు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో సుమారు 20 పామాయిల్ మొక్కలు, ఫెన్సింగ్ తీగలు పూర్తిగా కాలిపోయాయి. మూడు సంవత్సరాలుగా పెంచుతున్న తోట మంచి దిగుబడి దశలో ఉండగా ఈ ఘటనతో భారీ నష్టం వాటిల్లిందని



రైతు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. పామాయిల్‌కు ప్రస్తుతం మంచి ధర ఉండటంతో నెలకు రెండు సార్లు కటింగ్ వచ్చే పరిస్థితిలో ఈ అగ్ని ప్రమాదం తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని రైతు తెలిపారు.

# భవిష్యవాణి వినిపించిన కమ్యూనిస్టు తత్వవేత్త గిరిప్రసాద్



-నేడు గిరిప్రసాద్ 29వ వర్ధంతి

ప్రజాపక్షం/ ఖమ్మం : నేటి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను దశాబ్దాల క్రితమే అంచనా వేసి ప్రజలకు వివరించిన మార్క్సిస్టు, తత్వవేత్త కా॥ నల్లమల గిరిప్రసాద్. రాజకీయాల్లో పెరగనున్న ధన ప్రభావం, నిలకడ లేనితనం, రాజకీయ నేతలు విశ్వసనీయత కోల్పోవడం తదితర విషయాలను 90 దశకంలోనే ప్రజలకు వివరించిన మేధావి. ఒక నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా తుదిశ్వాస వరకు ప్రజాసమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన మహోన్నతుడు గిరిప్రసాద్. ఖమ్మంజిల్లా మధిర మండలంలోని తొండల గోపవరం గ్రామంలో 1931 ఏప్రిల్ ఆరున రైతు కుటుంబంలో జన్మించాడు. ప్రాథమిక విద్య అనంతరం మద్రాస్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తూ అప్పటి నిజాం రాజ్యంలో జరుగుతున్న ఆగడాలు, నిరంకుశ విధానాలు అదే సమయంలో ఆంధ్రమహాసభ సాగిస్తున్న ఉద్యమం గురించి తెలుసుకుని మద్రాస్ నుంచి స్వగ్రామానికి చేరుకున్నాడు. 1947లో ఆంధ్ర మహాసభలో చేరి గ్రామ రక్షణ దళాల్లో పని చేసిన గిరిప్రసాద్ కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. గిరిదళం పేరుతో ఉన్న సాయుధ దళానికి నేతృత్వం వహిస్తూ వేలాది ఎకరాల భూములను పేదలకు పంచి

మిగతా 2లో..

## కార్మికుల పక్షాన నిలిచేది ఎర్రజెండానే..




- ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని

ప్రజాపక్షం/పాల్వంచ : ఐక్య పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన సాధ్యమవుతుందని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులంతా ఎర్రజెండా నీడలోకిరావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పరిధి పాల్వంచ మునిసిపల్ శాఖ వివిధ విభాగాల్లో పని చేస్తున్న 90 మంది కార్మికులు కూనంనేని సమక్షంలో ఏఐటియుసి, సిపిఐలో చేరారు. వీరి ఎర్ర కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు అనుభవిస్తున్న ప్రతీ హక్కు ఏఐటియుసి పోరాట కృషి ఫలితమేనన్నారు. పని భద్రత, కనీస వేతనాలను అమలు చేసి బాధ్యత పాలకులు, యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు. బాధ్యతలను విస్మరించి పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. కార్మిక వర్గం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకొన్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రధానమంత్రి నరేంద్ర మోడి ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల సంక్షేమాన్ని యాజామాన్యాలకు, పారిశ్రామిక వేత్తలకు తాకట్టు పెడుతోందని విమర్శించారు. ఆదాని, అంబానీ లాంటి కార్పోరేట్ పెట్టుబడిదారులకు నరేంద్ర మోడి ప్రభుత్వం ఊడిగం చేయటం మినహా దేశ ప్రజలకు, కార్మిక వర్గానికి చేసింది శూన్యమని ఎద్దేవా చేశారు. కార్మికులు తమ హక్కులను కాపాడుకోవటానికి పోరాటాలే మార్గమని, చట్టాలు, హక్కులు అమలు కోసం కార్మికులు తిరగబడాలని, కార్మిక లోకం తిరుబాటు చేస్తే

మిగతా 2లో..

## విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో
# అప్రమత్తంగా ఉండాలి



-రైతులు బిల్లు తీసుకుని భద్రపరుచుకోవాలి
-కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రాబోయే సాగు సీజన్‌లను దృష్టిలో ఉంచుకుని రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం తెలిపారు. తక్కువ ధరలకు విత్తనాలు అందిస్తామని, అధిక దిగుబడి వస్తుందని ప్రచారం చేస్తూ రైతులను మోసం చేసే ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని రైతులు అలాంటి మోసపూరిత ప్రచారాలను నమ్మకుండా అధికారిక లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. అనధికారిక వ్యక్తులు లేదా గుర్తింపు లేని వ్యాపారుల వద్ద నుండి ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు కొనుగోలు చేయవద్దని కలెక్టర్ సూచించారు. ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లు తీసుకుని భద్రపరుచుకోవాలని, వ్యవసాయ శాఖ సూచించిన, ధృవీకరించిన విత్తనాలనే వినియోగించాలన్నారు. తెలియని కొత్త రకాల విత్తనాలు కొనుగోలు చేస్తే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల పై సమాచారం తెలిసినా, అనుమానాస్పదంగా విక్రయించే ప్రయత్నాలు చేసినా టోల్ ఫ్రీ నెం. 1077కు సమాచారం అందించాలన్నారు. జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలు మాత్రమే వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

**ప్రజలు జాగ్రత్తలు పాటించాలి..**

ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున వడదెబ్బ తగలకుండా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని

మిగతా 2లో..

# మండుటెండ @ 46.3 డిగ్రీలు

- జిల్లాలో కొనసాగుతున్న రెడ్ అలెర్ట్
- మణుగూరు, దుమ్ముగూడెంలలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఎండతీవ్రతతో పాటు మరో ప్రక్క వేడి గాలులు వీస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన నాలుగు రోజులుగా జిల్లాలో వేసవి రెడ్ అలెర్ట్ కొనసాగుతోంది. ఉదయం నుండే వడగాలులు మొదలవుతున్నాయి. ఉ.9 గం.లకే ఎండ తీవ్రత పెరిగిపోతోంది. రాత్రి 9 గం. దాటే వరకు కూడా వేడిగాలల నుండి ఉపశమనం లభించడం లేదు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వాతావరణ కొద్దిసేపు మబ్బులతో ఉన్న ప్పటికీ వేడి తీవ్రత కొనసాగింది.

**రెడ్ అలెర్ట్ :** జిల్లాలో 45 డిగ్రీలకు పై బడి ఎండ తీవ్రత ఉంటే రాష్ట్ర వాతావరణ శాఖ రెడ్ అలెర్ట ప్రకటిస్తుంది. మణుగూరు, దుమ్ముగూడెంలలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. లక్ష్మీ దేవిపల్లి 46.2 డిగ్రీలు, బూర్గంపాడులలో 46.1 డిగ్రీలు, గరిమెల్లపాడు, ఏడూళ్లబయ్యారంలో 46 డిగ్రీలు, భద్రాచలం సబ్ కలెక్టర్ ఆఫీస్ ప్రాంతంలో 45.8, అశ్వారావుపేట 45.7, యానంబైలు 45.6,మండలపల్లి 45.4, సత్యనారాయణపురం, ఆళ్లపల్లిలో 45.3, సీతారామపట్నం, సుజాతనగర్, కరకగూడెం, పాతకొత్తగూడెంలలో 45.2, ములకలపల్లి, అశ్వాపురం 45.1, మణుగూరు సింగరేణి జిఎం ఆఫీస్ ఏరియాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో రెడ్ అలెర్ట్ ప్రకటించారు.




జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో 44.09 డిగ్రీల నుండి 43.2 డిగ్రీల ఎండ తీవ్రత నమోదు కావడంతో ఆరెంజ్ అలెర్ట్‌లో కొనసాగుతున్నాయి.

**అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్**



వేసవి తీవ్రత అధికంగా ఉంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు, వృద్ధుల పట్ల కుటుంబీకులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎడదెబ్బకు గురైతే వెంటనే వైద్యులను సంప్రదించండి. అత్యవసర సమయాల్లో తప్ప ఎండలో తిరగకుండా ఉంటే మంచిది. ఆరోగ్యాల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.

# భవిష్యవాణి వినిపించిన కమ్యూనిస్టు తత్వవేత్త గిరిప్రసాద్

**(మొదటిపేజీ తరువాయి)** గ్రామ రాజ్యాలను స్థాపించారు. గిరిదళం పేరు చెబితే పోలీసుల వెన్నులో వణుకుపుట్టేది. సాయుధ పోరాటం తర్వాత 1953లో ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1962లో ఖమ్మం నుంచి శాసనసభ్యునిగా ఎన్నికై శాసనసభ వేదికగా ఒక గొప్పవక్తగా గిరిప్రసాద్ పేరొందారు. ముఖ్యంగా గిరిప్రసాద్ అధ్యయనం చేయడంలో దిట్ట. ప్రతి అంశాన్ని సిద్ధాంతానికి అన్వయిస్తూ పరిష్కార మార్గాన్ని చూపే అతికొద్ది మంది వ్యక్తుల్లో గిరిప్రసాద్ ఒకరు. ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి పోరాట మార్గంలో పరిష్కార మార్గాన్ని అన్వేషించే వారు. ప్రస్తుతం నెలకొన్న రాజకీయాల్లో ఆర్థికపరమైన విషయాలను 1990 దశకంలో జరిగిన అనేక సమావేశాలు, సభల్లో ప్రజలకు వివరించే వారు. ధన ప్రభావం పెరిగిన తర్వాత కమ్యూనిస్టుల ప్రభావం క్రమేపి తగ్గవచ్చునని నిరంతరం ప్రజల మధ్య గడపడం ద్వారా బలోపేతానికి కృషి చేయాలని ఆయన పలు సందర్భాల్లో సూచించారు. మత ఉన్మాద చర్యలను ఆయన పలు సందర్భాల్లో ఉటంకిస్తూ మతం రాజకీయాల్లోకి చొప్పిస్తే ఉన్మాదులు రాజ్యమేలే పరిస్థితి ఉందని హెచ్చరించే వారు. ప్రస్తుతం దేశంలో ఇప్పుడు నెలకొన్న పరిస్థితులు ఆనాటి గిరిప్రసాద్ మాటలు అద్దంపట్టేవి. 1978లో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై 1991 వరకు ఆయన ఆ పదవిలో కొనసాగారు. రాష్ట్రంలోని సమస్యలు, పాలకుల విధానాలపై ఆయన నిరంతరం తన ప్రకటనలతో స్పందించే వారు. ముఖ్యంగా ఎన్‌టి రామారావు పాలన కాలంలో గిరిప్రసాద్ ప్రకటనల కోసం రాష్ట్ర ప్రజలు ఎదురు చూసేవారంటే అతిశయోక్తి కాదు. 1992లో రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన ఆయన పార్లమెంటులో సిపిఐ పక్ష నాయకునిగా పని చేశారు. జాతీయ సమితి ఉప ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గిరిప్రసాద్ తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్‌గా పని చేస్తూ 1997 మే 24న మరణించారు. గిరిప్రసాద్ ఆశయం మహోన్నతమైంది. కమ్యూనిస్టుల అవసరం పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో గిరిప్రసాద్ ఆశయ సాధనలో ముమ్ముందుకు సాగడమే ఆయనకు మనమిచ్చే సరైన నివాళి.

**నేడు గిరిప్రసాద్ వర్ధంతి :**

భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి సభ ఈనెల 24న ఉదయం తొమ్మిది గంటల గిరిప్రసాద్ భవన్‌లో జరుగుతుందని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు పాత బస్టాండ్ సమీపంలోని గిరిప్రసాద్ విగ్రహం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడంతో పాటు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. వర్ధంతి సభలో పాల్గొని మహనీయునికి నివాళులర్పించాల్సిందిగా కమ్యూనిస్టు పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆయన కోరారు.

# పర్యాటక అభివృద్ధికి యువత భాగస్వామ్యం కీలకం




**-పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన**
**-టూరిజం కిట్ ప్రారంభం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పర్యాటక రంగ అభివృద్ధికి యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాల సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టూరిజం కిట్ ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి పాల్గొని టూరిజం కిట్‌ను విడుదల చేసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో సహజసిద్ధమైన పర్యాటక ప్రాంతాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి పర్యాటక వారోత్సవాలు దోహదపడతాయన్నారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని పర్యాటక రంగం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయన్నారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు పర్యాటక రంగ అభివృద్ధే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో డివైఎస్‌వో సునీల్‌రెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఎఈ నరేష్ నాయక్, ఖమ్మం టూరిజం సిబ్బంది కె. చంద్రశేఖర్ ఆజాద్, యువత తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు శాశ్వత గృహ సౌకర్యం కల్పించడం ఎంతో ఆనందం

**- ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం**



**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద ప్రజలకు శాశ్వత గృహ సౌకర్యం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మణుగూరు మండలం బెస్తగూడెంలో పిట్ట ముతమ్మ లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని, ప్రతి అర్హులైన కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులందరికీ అందించేందుకు తాను నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే పాయం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మున్సిపల్ డిఈ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ పావని, వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, భద్రాద్రి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివ సైదులు, భద్రాద్రి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బానోత్ లక్ష్మ ణ్, 14 టైర్ అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, పాతూరు వెంకన్న, బొగ్గు ముఠా అధ్యక్షులు నీరుడు రాంబాబు, కురం రవి, తుపూడి శ్రీను, జర్పుల జగన్, దొడ్డపునేని మధు, తాత ప్రసాద్, తమ్మిశెట్టి సాంబ, ఆముదాల శ్యామల, వేముల స్వరూప, బత్తుల శ్రీను, పల్లెం నగేష్, మోదం ముత్యాలరావు, కట్ట నరసింహ, దేగల కృష్ణారావు, గుమస్తాల సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వివోఏలకు కనీస వేతనం అమలు చేయాలి



**-రెండో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష**
**-వివోఏలకు కనీస వేతనం అమలు చేయాలి**
**అధ్యక్షురాలు వేల్పుల సుశీల**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** తెలంగాణ రాష్ట్రంలో వివో ఏ లకు కనీస వేతనం అమలు చేయాలని పని భారాన్ని తగ్గించి వివోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి పెన్షన్ విధానాన్ని అమలు చేసి వివోఏల వేతనాన్ని నేరుగా వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని పలు డిమాండ్లతో మే 18 నుండి చేస్తున్న సమ్మె రిలే నిరాహార దీక్ష రెండో రోజుకు చేరింది తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని వివోఏలు బస్టాండ్ సెంటర్లో దీక్షకు దిగారు ఈ సందర్భంగా వివోఏల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల ఆర్థిక అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్న వివోఏల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యంగా ఉందని వివోఏలు ఏళ్ల తరబడి 500 నుంచి 1500 వరకు పనిచేశారని ప్రస్తుతం 5000 రూపాయలు ఇస్తున్నారని వివోఏలా పనికి తగ్గ వేతనం అమలు చేసి కనీసం 20 వేల రూపాయలు ఇవ్వాలని వారి వేతనాన్ని నేరుగా తమ వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని ఇన్సూరెన్స్ అమలు చేయాలని 57 ఏళ్లు దాటిన వివోఏలకు పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దీక్ష నిర్వహిస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక మంత్రులు స్పందించి వివోఏల డిమాండ్లను అమలు చేసే దిశగా సానుకూలంగా స్పందించాలని వారి కోరారు. ఈ కార్యక్రమంలో వివోఏ ల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల, గుగ్గిళ్ళ ఉమా, అరుణ, రమణ, రాంబాయి, కుసుమ, కరుణ, కృష్ణవేణి, విజయలక్ష్మి, కలమ్మ, జ్యోతి, కుమారి, శ్రీలత, లలిత తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పక్షాన నిలిచేది ఎర్రజెండానే..




**(మొదటిపేజీ తరువాయి)**

పాలకులు తమ మెడలు వంచక తప్పదన్నారు. కార్మికులకు అండగా ఏఐటియుసి, సిపిఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్లు వీసంశెట్టి విశేవశ్వర్‌రావు, గుర్రం వెంకటేశ్వర్లు (జివిఆర్ ), నామా కీర్తి, గొర్లె అన్నపూర్ణ, సిపిఐ, ఏఐటియుసి నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, వైఎస్ గిరి, గౌతమి క్రిష్ణ, వల్లపు యాకయ్య, గౌస్‌పాషా, అహ్మద్ జానీ, కరీం, ఆలపాటి ప్రసాద్, గొర్లె నరేష్, నామా పండు, నవీన్, బర్ల వెంకటరత్నం, కాటూరి రాము, రామాచారి, ఏఎస్‌ఎన్ సత్యనారాయణ, గుర్రం వెంకటేష్, అంబడిపుడి నరేంద్ర, రామారావు, సంజీవరావు, అల్లి వెంకటేశ్వర్లు, లక్ష్మి, పార్టీలో చేరిన ఏలూరి రామారావు, విజయలక్ష్మి, దొనకొండ రామక్రిష్ణ, ఏఐటియుసిలో చేరిన నాగేశ్వరరావు, రవి, సురేందర్, లక్ష్మయ్య, రాయప్ప, అశోక్, రమేష్, వెంకటేష్, ప్రవీణ్, రాంబాబు, సరోజ, విజయ, లాలీ, రమణ, బుజ్జి, గంగా భవాని, కల్పన, బాబులాల్, సునీత, లక్ష్మి, గిగ్ వర్కర్లు శ్రీను, రాజేష్, నితిన్, ప్రేమ్ కుమార్, ఉపేందర్, రంజిత్, అశోక్, లక్ష్మణ్, మధు, సోడా సాంబ, భాస్కర్, శ్రీకాంత్, తిరుపతమ్మ, జాన్ పీటర్, రాజు, నజీర్, నవీన్, నాగరాజు, లక్ష్మణ్‌రావు, ప్రేమ్ కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో

# అప్రమత్తంగా ఉండాలి

**(మొదటిపేజీ తరువాయి)** ఎండలో బయట తిరగవద్దని అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటకు రాకూడదని, చిన్నారులు, వృద్ధులు ఇంటికే పరిమితం కావాలన్నారు. ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. సరిపడ త్రాగునీరు తీసుకోవాలని, వదులుగా ఉన్న దుస్తులు ధరించాలని, బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ, కాటన్ వస్త్రాలను ధరించాలని సుదూర ప్రయాణాలు చేయకూడదన్నారు. ఎండలో పనిచేసే కార్మికులు తరచూ నీటితో పాటు ఓఆర్ఎస్ ద్రవణాన్ని తీసుకోవాలని సూచించారు. అధిక మాంసకృతులు కలిగిన ఆహారం, నిల్వ ఆహారాన్ని తినవద్దని సూచించారు. అధిక చెమట, దాహం, బలహీనత, తలతిప్పడం, కండరాలు పట్టేయడం వంటి లక్షణాలు ఉన్నచో వడదెబ్బగా భావించి సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని అవసరమైన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ తెలిపారు.

# జామాయిల్ తోట దగ్ధం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి జామాయిల్ తోట దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని రేగులచలక గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన తుమ్మలపల్లి పుల్లయ్యకు చెందిన మూడు ఎకరాల జామాయిల్ తోటకు నిప్పంటుకుంది. స్థానికులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చి మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. ఈ ఘటనలో చెట్లన్ని దగ్ధమైనట్లు సమాచారం. ప్రమాదవ శాత్తు మంటలు అంటుకున్నాయా లేక చుట్టు పక్కల పంట అవశేషాలు కాల్చడం వల్ల నిప్పంటుకుందా అనేది తేలియాల్సి ఉంది. మూడు ఎకరాల్లో చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు రైతు పుల్లయ్య వాపోయాడు. ప్రభుత్వ తరుపున నష్ట పరిహారం అందించాలని రైతు పుల్లయ్యతో పాటు స్థానిక రైతులు కోరారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

# సామాన్యులపై పెనుభారం

**ప్రజాపక్షం/పాల్వంచ :** ధరలను పెంచబోమని నమ్మబలికి ఒకే నెలలో పెట్రోల్, డీజిల్ ధరలను పెద్ద మొత్తంలో పెంచటం హేయమైన చర్య అని, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచుంకుంటూ పోతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదని సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు అన్నారు. శనివారం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఎన్నికల సమయంలో మేము పెట్రోల్, డీజిల్ పై ఎటువంటి ధరలను పెంచబోమని అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మించి ఎన్నికల అనంతరం ప్రజల నమ్మకాన్ని వమ్ముచేస్తూ ధరలను పెంచుతున్నారని ఆరోపించారు. శ్రమను నమ్ముకొని బతుకుతున్న ప్రజలు, అసంఘటిత రంగాలలో పని చేస్తున్న కోట్లాది మంది కార్మికులు కనీస వేతనం పొందలేని పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. ధరలు పెరగటం వలన పేద ప్రజల జీవనం ప్రమాదంలోకి జారుతోందని వాపోయారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా నియంత్రించి పేదలను కాపాడాలన్నారు.

# తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలి



**-సిడిఎంఏ సిడివో హేమలత**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇంటి స్థాయి నుంచే తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించడం ద్వారా చెత్త నిర్వహణ మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చునని సిడిఎంఏ సిడివో హేమలత తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థ డంపింగ్ యార్డులో శనివారం ఉమ్మడి ఖమ్మంజిల్లాకు చెందిన మున్సిపాలిటీ అధికారులకు తడి, పొడి చెత్త వేరు చేయడం, తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువుగా మార్చడం తదితర అంశాలపై సిడివో హేమలత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులో తడి చెత్తను శాస్త్రీయ పద్ధతిలో ఎరువుగా తయారు చేసే ప్రక్రియను ప్రత్యక్షంగా ప్రదర్శించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి స్థాయి నుంచే తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించడం ద్వారా చెత్త నిర్వహణ మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చునన్నారు. తడి చెత్తను ఎరువుగా మార్చడం ద్వారా డంపింగ్ యార్డులలో చెత్త పేరుకు పోవడం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పాడుతుందని తెలిపారు. పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపించడం ద్వారా వ్యర్థాలను తగ్గించవచ్చునని, జీరో వేస్ట్ సిటీ లక్ష్య సాధనలో ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. గృహవాసులకు కూడా తడి, పొడి చెత్తలను వేరు వేరుగా సిబ్బందికి అందించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు కూడా పరిశుభ్రమైన పర్యావరణ హిత నగరాల నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మున్సిపాలిటీల కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్లు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ డైరెక్టర్ నుండి సుడా చైర్మన్‌గా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్



**-ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రథమ అనుచరుడు దుర్గాప్రసాద్**
**-నేడు సుడా చైర్మన్‌గా ప్రమాణస్వీకారం**

**ప్రజాపక్షం/వైరా:** పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ 1984వ సంవత్సరంలో 22 ఏళ్ల లేత ప్రాయంలోనే వైరా గ్రామశాఖ జనరల్ సెక్రటరీగా రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత కెవిసి డిగ్రీ కళాశాల ఆర్గనైజింగ్ సెక్రటరీగా, వైరా సొసైటీ డైరెక్టర్‌గా సేవలను అందించారు. 2001లో వైరా మేజర్ పంచయతీ సర్పంచ్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయంతో తిరుగులేని రాజకీయ ప్రస్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సోమవరం గ్రామ సర్పంచ్‌గా అభివృద్ధి చేసే చెరగని ముద్ర వేసుకున్నారు. మధిర నియోజకవర్గ ఇంచార్జిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా,ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధిగా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. 2019 నుండి 2026 వరకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టివిక్రమార్క సహచరుడిగా, ప్రధాన అనుచరుడిగా ఉన్న పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యేలతో మాజీ ఎమ్మెల్యేలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించారు. మంత్రులతో సైతం మర్యాదగా నడుచుకునే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి దుర్గాప్రసాద్. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో కూడా జిల్లాలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు, నాయకులకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల తరపున పోరాటాలు చేశారు. 2023లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విజయంలో తనకంటూ గుర్తింపు చెరగని ముద్ర వేసుకున్న దుర్గాప్రసాద్‌ను కాంగ్రెస్ అధిష్టానం సైతం అతను సేవలను గుర్తించింది. పద వుల కన్నా పార్టీ ముఖ్యమని నిరంతరం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం భట్టివిక్రమార్క సూచనలతో ముందుకు కొనసాగాడు. ఖమ్మం సుడా చైర్మన్‌గా దుర్గాప్రసాద్‌ను కాంగ్రెస్ అధిష్టానం నియమిం చింది. సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రవేశం చేసిన దుర్గాప్రసాద్ అంచలంచెలుగా ఎదుగుతూ తన రాజకీయ ప్రయాణం సొసైటీ డైరెక్టర్ నుండి సుడా చైర్మన్ వరకు వచ్చింది. ఏ పదవులు చేపట్టిన వైరాపై మమకారం నేటికి ఆయనకి ఎక్కడ తగ్గలేదని చెప్పవచ్చును. పదవులు ముఖ్యం కాదు మనిషి మనుగడ ముఖ్యం మంచితనం ముఖ్యం అనే తత్వంతో దుర్గాప్రసాద్ రాజకీయ ప్రస్థానం ముందుకు కొనసాగింది. నేడు ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్‌లో సుడా చైర్మన్‌గా దుర్గాప్రసాద్ బాధ్యతలు చేపట్టనున్నారు.

# చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున అంతరాష్ట్ర దొంగను ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఖమ్మం టౌన్ ఏసిపి ఎస్‌వి రమణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు అంకిరెడ్డిపాలెంకు చెందిన పట్నాల వెంకటదుర్గ ప్రభు అలియాస్ అఖిల్ ఒంటరిగా వెళ్తున్న మహిళలే లక్ష్యంగా చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడని తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా నెంబర్‌ప్లేటు లేని ద్విచక్రవాహనంపై వెళ్తున్న అఖిల్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడని తమ సిబ్బంది గమనించి అతనిని పట్టుకుని విచారించగా చోరీల విషయం బయటపడిందన్నారు. గుంటూరులో జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తూ రుణాల ఈఎంఐలు చెల్లించడం, విలాసవంతమైన జీవితం కోసం డబ్బు సరిపోక చోరీలకు పాల్పడుతున్నట్లు తమ విచారణలో అంగీకరించాడని తెలిపారు. ఏపిలో బాపట్ల జిల్లా కర్లపాలెం, పల్నాడు జిల్లా నర్సరావుపేట, ఒంగోలు జిల్లా అద్దంకి, గుంటూరు జిల్లా పొన్నూరు పోలీసుస్టేషన్లలో నిందితునిపై కేసులు ఉన్నాయని తెలిపారు. ఇటీవల ఖమ్మం వచ్చిన అఖిల్ శ్రీరామ్‌నగర్ రోడ్డు నెంబర్ 7లో ఆటో దిగి వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గోలుసును దోచికి యత్నించాడని చెప్పారు. గోలుసు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించి గోలుసు లాక్కుని పారిపోయే క్రమంలో గోలుసు కిందపడిందని చెప్పారు. భాదితురాలు ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులకు శుక్రవారం తిరిగి అదే విధంగా ఒంటరిగా వెళ్తున్న మహిళలు, వృద్ధులకోసం ఖమ్మం వచ్చినట్లు నిందితుడు తెలిపాడని ఏసిపి వెల్లడించారు. ఈక్రమంలో శ్రీశ్రీ సర్కిల్ వద్ద తనిఖీచేస్తున్న ఖానాపురం పోలీసులకు అనిల్ దొరికాడని అతనిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలిస్తున్నట్లు ఏసిపి పేర్కొన్నారు. ఒటరి మహిళలు, వృద్ధులు ఇలాంటి నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏసిపి రమణమూర్తి చెప్పారు.

## డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలో శనివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం తృటిలో తప్పింది. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద హైదరాబాద్ నుంచి రాజమండ్రి వెళ్తున్న యాసిడ్ ట్యాంకర్ లారీ వేగంగా వచ్చి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు లారీ ముందు చక్రాలు డివైడర్ పైకి ఎక్కడమే కాకుండా ట్రాఫిక్ పోలీస్ స్టాండ్‌ను ధ్వంసం చేసింది. లారీ డిజిల్ ట్యాంక్ పగిలి రోడ్డు పాలైయింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా ఆసమయంలో అటుగా ఎటువంటి వాహనం రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న టూటౌన్, ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని క్రేన్‌ల సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. డ్రైవర్ నిద్రమత్తే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# దాతల సహకారంతో పశుగ్రాసం అందజేత



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** పట్టుబడ్డ పశువులకు గ్రామం నిమిత్తం దాతల సహకారంతో పశుగ్రాసాన్ని అందజేశారు. అక్రమ రవాణాలో పోలీస్ చెక్‌పోస్టుల వద్ద పట్టుబడ్డ పశువులను కామేపల్లి మండలం పండితాపురంలో ఏర్పాటు చేసిన షెల్టర్‌లో ఉంచారు. వాటికి గ్రాసం ఏర్పాటు చేయాలని పశుసంవర్ధక శాఖ జేడి డా॥ బి. పురంధర్ సూచనల మేరకు శనివారం వి. వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్రాక్టర్ వరిగడ్డిని అందజేశారు. సర్పంచ్ కాపా ఆదినారాయణ, ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాతలు పరుచూరి నాగేశ్వరరావు, గంగవరపు బాబు రావు, కుతుంబాక రవీంద్రకుమార్, చిట్టిమోతు వీరనారాయణ, కూరాకుల పెద్ద లక్ష్మి నారాయణ, కూరాకుల సత్యం, పోతగాని పెద్ద పుల్లయ్య, పంకు రామకృష్ణ తదితరులు ట్రాక్టర్ వరిగడ్డిని అందజేశారు. సహకరించిన దాతలకు, సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఈ కార్యక్రమానికి సహకరించిన ఆగర్ల నర్సింహారావు, ధనియాకుల శ్రీరామ్ లకు పశు సంవర్ధక శాఖ ఉప కేంద్రం వి. వెంకటాయపాలెం తరుపున జెవివో టి. కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# డీలర్లు చట్టాలకు లోబడి వ్యాపారం చేయాలి



**ప్రజాపక్షం/ మధిర :** డీలర్లు అందరూ విత్తన, పురుగుమందు చట్టం ఎరువుల చట్టాలకు లోబడి వ్యాపారం చేయాలని మధిర వ్యవసాయ సంచాలకులు ఎస్.విజయచంద్ర, మధిరరూరల్ సిఐ డి.మధు సూచించారు. స్థానిక రైతు వేదికలో మధిర, ఎర్రుపాలెం మండలాల ఫెర్టిలైజర్స్, సీడ్స్ డీలర్లకు సమావేశం నిర్వహించారు. వానాకాలం సమీపిస్తున్న సందర్భంగా డీలర్లు అందరూ విత్తనాలు మంచి కంపెనీ నుంచి తెప్పించి రైతులకు అమ్మాలని, దానికి సంబంధించిన ఇన్వాయిసులు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, గ్రో అవుట్ రిజల్ట్స్ దగ్గర పెట్టుకోవాలని, స్టాక్ రిజిస్టర్లను ప్రతిరోజు అప్‌డేట్ చేయాలని డీలర్లకు సూచించారు. రైతులకు అమ్మే విత్తనాల గుణగణాలను సరైన రీతిలో గైడెన్స్ ఇవ్వాలని తెలిపారు. లైసెన్స్‌లను కనిపించే విధంగా డిస్ప్లే చేయాలని, స్టాక్ బోర్డులను ప్రతిరోజు అప్‌డేట్ చేయాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను, పురుగుమందులను మాత్రమే సరఫరా చేయాలని, ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సాయి దీక్షిత్, ఎర్రుపాలెం ఏఓ సాయిశివ పాల్గొన్నారు.

# పాలీసెట్ ఫలితాల్లో సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్



**ప్రజాపక్షం/ మధిర :** శనివారం ప్రకటించిన పాలీసెట్ ఫలితాల్లో మధిర పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థి కందూరి ఆదిత్య స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ మేరీథామస్, ప్రిన్సిపాల్ సిస్టర్ ఆన్‌బేబి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్కూల్‌లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించటంతో పాటు ఇతర పోటీ పరీక్షల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటి ర్యాంకులు సాధించే విధంగా అన్ని విధాలుగా కృషి చేయటం జరుగుతుందని తెలిపారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకును సాధించిన విద్యార్థి కందూరి ఆదిత్యను వారితో పాటు అకాడమిక్ కోఆర్డినేటర్ ఎం.వెంకటనారాయణ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా ఈ విజయానికి కారకులైన సిబిఎస్ఇ టెస్ట్ సబ్జెక్ట్ టీచర్స్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

# మధిర పాలిటెక్నిక్ కళాశాలకు హెల్ప్‌లైన్ సెంటర్ మంజూరు




**ప్రజాపక్షం/ మధిర మున్సిపాలిటీ :** తెలంగాణ ప్రభుత్వ కామన్ ఎంట్రన్స్ టెస్టులు( పాలీసెట్) సంబంధిత కౌన్సిలింగ్ కార్యక్రమాల కోసం ప్రభుత్వం టెక్నిక్ కళాశాల మధిరలో హెల్ప్‌లైన్ సెంటర్ మంజూరు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.సాంబయ్య తెలిపారు. శనివారం మాట్లాడుతూ మధిర, పరిసర ప్రాంతాల విద్యార్థులకు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణి(ఐఏఎస్), సాంకేతిక విద్యాశాఖ కమీషనర్ దేవసేనలు ప్రభుత్వ పాలిటెక్నిక్ మధిర కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాలీసెట్, ఐఇపి సెట్, ఐసిసిటిసెట్ తదితర కౌన్సిలింగ్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకునే సమయంలో ప్రభుత్వ పాలిటెక్నికల్ మధిర కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌గా ఎంపిక చేసుకోవాలని సూచించారు. మధిర, సమీప ప్రాంతాల విద్యార్థులతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన విద్యార్థులు కూడా ఈ సేవలను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. హెల్ప్‌లైన్ సెంటర్ మంజూరు చేసిన ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి, సాంకేతిక విద్యాశాఖ కమీషనర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## వివోఏల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

### -సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్



**ప్రజాపక్షం/ఏన్కూరు:** వివోఏల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని గత రెండు రోజులుగా ఏన్కూరులో దీక్ష చేస్తున్నారు. వారి దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ మాట్లాడుతూ వివోఏల శ్రమకి తగిన వేతనం ఇవ్వాలని, 26వేలు నెలకి ఇవ్వాలన్నారు. పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, డెత్ ఇన్సూరెన్స్ 20లక్షలు ఇవ్వాలని తదితర డిమాండ్స్‌నీ ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. మీ న్యాయమైన డిమాండ్స్ సాధనలో మీకు సీపీఐ అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సంఘీభావంలో సీపీఐ గ్రామ కార్యదర్శి మాదినేని వెంకన్న పాల్గొన్నారు. వివోఏల జేఏసీ మండల అధ్యక్షులు జంపాల రమేష్‌తో పాటు మండలంలో అన్ని గ్రామాల వివోఏలు దీక్షలో పాల్గొన్నారు.

## చెరువు కట్ట ఎత్తు పెంపు నిలిపివేయాలి

### -పోలీస్ స్టేషన్‌లో ఆయకట్టు రైతుల ఫిర్యాదు



**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల పరిధిలోని తూతక లింగన్న పేట ఊర చెరువు కట్ట ఎత్తు పెంపు పనులను వెంటనే నిలిపివేసి రైతులకు న్యాయం చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. శనివారం ఏన్కూరు పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. చేపల చెరువు యజమాని అక్రమంగా కట్ట ఎత్తు పెంచుతున్నాడని, దీంతో చెరువు ఆయకట్టు కింద ఉన్న పంట పొలాలు మునిగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. చేపల పెంపకం కోసం మట్టి కట్టలు వేసి ఎత్తు పెంచడం వల్ల పొలాల రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి కట్ట పనులను నిలిపివేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో రైతులు తంబళ్ల జయరాజు, ఎం కృష్ణమోహన్, ఇసాక్, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా సర్పంచ్



**ప్రజాపక్షం/కారేపల్లి:** భాగ్యనగర్ తండాకు చెందిన గుగులోత్ భూలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబానికి గ్రామ సర్పంచ్ బానోత్ హీరాలాల్ అండగా నిలిచారు. దశ దిన కార్యక్రమానికి తన వంతు సహాయంగా 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈసందర్భంగా బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోత్ భిక్కులాల్, వార్డు సభ్యులు తేజావత్ భూలి, గుగులోత్ మహేష్, గుగులోత్ నాగేశ్వరరావు, పంచాయితీ సిబ్బంది గుగులోత్ రాందాస్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ




**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మం ఎంపీ కార్యాలయంలో ఎంపీ రఘురామరెడ్డి కారేపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని 12 మందికి చెక్కులు మంజూరయ్యాయి. కారేపల్లి గ్రామానికి చెందిన మేకల పద్మకు రూ 22వేలు, జగ్గాని మంజులకు రూ 23వేలు, తురక రమణకు రూ 21వేలు, హక్కుల లక్ష్మీ కి రూ 22వేలు చొప్పున అందజేశారు. ఈసందర్భంగా ఎంపీ రఘురామరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో దుర్గా ప్రసాద్, నూథి సత్యనారాయణ, ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, గుగులోతు సంతోష్, తొగర శ్రీను, తురక రాంబాబు పాల్గొన్నారు.

### పినపాక నియోజకవర్గాన్ని

## అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

**- పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు**
**రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే పాయం**



**ప్రజాపక్షం/మణుగూరు:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పినపాక నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అదే స్ఫూర్తితో పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు సుమారు రూ. 5 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాయం శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులు మరియు నాయుడు కుంట పూడికతీత పనులను ప్రారంభించారు.

**శంకుస్థాపనలు ఇలా....**

అన్నారం బైపాస్ రోడ్డులో సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు రూ.43 లక్షలు, శాంతినగర్‌లో సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు రూ.23 లక్షలు, కోటకట్ట ప్రాంతంలో సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు రూ.47 లక్షలు, పాత మణుగూరులో సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు రూ.42 లక్షలు, గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతంలో సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు రూ.48 లక్షలు, మంగళకట్ట ప్రాంతంలో సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు రూ.47 లక్షలు, నాయుడు కుంటలో పూడికతీత మరియు అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్లు మొత్తంగా సుమారు రూ.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో అభివృద్ధి మరియు సంక్షేమ పాలన సమర్థవంతంగా కొనసాగుతోందన్నారు. పినపాక నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక వసతి కల్పించేందుకు తాను నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. మణుగూరు పట్టణంలో డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టామని, నాయుడు కుంట అభివృద్ధి ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరిగి ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మున్సిపల్ డిఈ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ పావని, వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, భద్రాద్రి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివ సైదులు, భద్రాద్రి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బానోత్ లక్ష్మణ్, 14 టైర్ అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, పాతూరు వెంకన్న, బొగ్గు ముఠా అధ్యక్షులు నీరుడు రాంబాబు, కురం రవి, తుపూడి శ్రీను, జర్పుల జగన్, దొడ్డపునేని మధు, తాత ప్రసాద్, తమ్మిశెట్టి సాంబ, ఆముదాల శ్యామల, వేముల స్వరూప, బత్తుల శ్రీను, పల్లెం నగేష్, మోదం ముత్యాలరావు, కట్ట నరసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కూసుమంచి శివాలయ అభివృద్ధికి రూ 3.30కోట్ల వరం

**-ప్రత్యేక అభివృద్ధి నిధులతో**
**ఆరు కీలక పనులకు పరిపాలన అనుమతులు**





**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల కేంద్రంలోని పురాతన శివాలయం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. మంత్రి, పాలేరు శాసన సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభ్యర్థన మేరకు ప్రత్యేక అభివృద్ధిని నిధి 2024,25 పథకం కింద మొత్తం రూ 330.50లక్షలు మంజరై పరిపాలన అనుమతులు లభించాయి. ఈ నిధులతో ఆలయ అభివృద్ధికి సంబంధించి ఆరు ప్రధాన పనులు చేపట్టనున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కళ్యాణ మండపం నిర్మాణానికి రూ 26లక్షలు, పాకశాల నిర్మాణానికి రూ 8.50లక్షలు, ఆఫీస్ గది, స్టోర్ రూమ్ నిర్మాణానికి రూ 15.50లక్షలు కేటాయించారు. అదే విధంగా ఆలయ ప్రధాన ప్రవేశానికి ఆకర్షణీయమైన ఆర్చ్‌గేట్ నిర్మాణానికి రూ 14.50లక్షలు మంజూరు చేశారు. ఆలయ ప్రాకార వాల్ నిర్మాణానికి అత్యధికంగా రూ 141 లక్షలు, శుభాదం మండపం నిర్మాణానికి రూ 125లక్షలు కేటాయించారు. మొత్తం రూ3,30,50,000 వ్యయంతో ఆలయ రూపురేఖలు మారనున్నాయి. ఈ పనులను ఒక సంవత్సరం కాల పరిమితిలోపు పనులు పూర్తి చేయనున్నారు. నిధుల మంజూరుతో కూసుమంచి ప్రాంత భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అభివృద్ధితో ఆధ్యాత్మిక పర్యాటకానికి కూడా ఊతం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన

**రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం విజయవంతం**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల, ములకలపల్లి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం మూకామామిడి పంచాయితీ మొగరాలగుప్ప గ్రామంలో విజయవంతంగా ముగిసింది. ఈసందర్భంగా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె హేమంత కుమార్ మాట్లాడుతూ పరిశోధనలను ప్రయోగశాలలకే పరిమితం కాకుండా రైతుల పొలాలకు తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు. రైతులు ఆయిల్ ఫామ్, మిరప, పప్పు ధాన్యాలు వంటి లాభదాయక పంటల సాగు వైపు మొగ్గు చూపాలని సూచించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని కాపాడుకోవాలని, యూరియా వాడకాన్ని నియంత్రించాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పరికరాలు పంపిణీ వేగవంతం చేస్తున్నామని తెలిపారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడంతో పాటు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదు తప్పని సరిగా తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కోర్స ఆదిలక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారులు రాహుల్, రజనీకాంత్, రమేష్, ఆరోగ్య శాఖ సిబ్బంది, వార్డు సభ్యులు రాజ్ కుమార్, పావని, మంగమ్మ, శ్రీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు..!

**-ప్రధాన రహదారిపై తక్కువ ఎత్తులో ఉన్న కరెంట్ వైర్లు**
**-సరి చేయని విద్యుత్ శాఖ అధికారులు**
**-ఆందోళన చెందుతున్న గ్రామస్తులు**



**ప్రజాపక్షం/పినపాక:** నేలకు చేతికంటే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలను చూసి గ్రామ ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. తప్ప వాటిని నిరంతరం అధికారులు పర్యవేక్షించడం లేదు. దీంతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. బిల్లులు వసూలపై ఉన్న శ్రద్ధ, సమస్యలను పరిష్కరించడంలో చూపడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. పినపాక మండలంలోని పాతరెడ్డిపాలెం పంచాయితీలోని చింతలబయ్యారం గ్రామంలో ప్రధాన రహదారిపై విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఆర్టీసీ బస్ సేవలను ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించారు. నిత్యం చింతలబయ్యారం గ్రామానికి ఆర్టీసీ బస్సు వస్తుంది. కాబట్టి ప్రమాదాలు జరిగేలా ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వ్యవసాయ అవసర నిమిత్తం పడించిన పంటను ట్రాక్టర్లపై పొలాల నుండి ఇంటి వద్దకు తీసుకెళ్లాలంటే రైతులు జంకుతున్నారు. అయితే నిర్వహణ కొరవడి విద్యుత్ తీగలు క్రమేణా సాగి నేలకు చేతికందే ఎత్తుకు చేరాయి. గతంలో పశువులు మేత కోసం వెళ్లినప్పుడు మృతి చెందిన దాఖలాలు ఉన్నాయి. గతంలో పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధత అధికారులు కిందకు వేలాడుతుఊ యమపాషాలుగా మారిన విద్యుత్ తీగలను సరి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

**విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలి...**

ప్రధాన రహదారిపై కిందకి ఉన్నటువంటి విద్యుత్ తీగలకు విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని చింతల బయ్యారం గ్రామస్తులు తోట రాజేష్ డిమాండ్ చేశారు. అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఎటువంటి నష్టం జరగకముందే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

## భారీ ఉష్ణోగ్రతలతో పెరిగిన విద్యుత్ డిమాండ్

**-బూర్గంపాడు మండల ప్రజలు సహకరించాలి:**
**ఏఈ ఉపేందర్ విజ్ఞప్తి**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భారీ ఎండలు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, బూర్గంపాడు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు విద్యుత్ వినియోగంలో నియంత్రణ పాటించి విద్యుత్ శాఖకు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ ఉపేందర్ విజ్ఞప్తి చేశారు. అధిక లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్ లోడ్ అవుతూ తరచూ ట్రిప్ కావడం, ఫ్యూజులు కాలిపోవడం జరుగుతోందని తెలిపారు. దీంతో కొన్ని చోట్ల విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు లైన్మెన్‌లు, టెక్నికల్ సిబ్బంది పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరం పని చేస్తున్నారని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సమయంలో ప్రజలు ఓపికగా వ్యవహరించి సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్రజల సహకారంతోనే విద్యుత్ సరఫరాను స్థిరంగా కొనసాగించగలమన్నారు. కరెంటు వచ్చిన వెంటనే ఏసీలు, భారీ లోడ్ పరికరాలు ఒకే సారి ఆన్ చేయవద్దని సూచించారు. ఒక్కసారిగా అధిక లోడ్ పెరగడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. విద్యుత్ వచ్చిన 10 నుంచి 15 నిమిషాల తర్వాత మాత్రమే ఏసీలు, భారీ పరికరాలు ఆన్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గి సరఫరా మెరుగ్గా కొనసాగుతుందని వివరించారు. మనమందరం కలిసి విద్యుత్‌ను ఆదా చేద్దాం..విద్యుత్‌ను ఆదా చేయండి. భవిష్యత్తును కాపాడండి అంటూ ఏఈ ఉపేందర్ మండల ప్రజలకు పిలుపునిచ్చారు.

## ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటాం

**బిక్షాటన చేస్తూ నిరసన తెలిపిన గ్రామదీపికలు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** గ్రామదీపికల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తో తాడోపేడో తెల్చుకుంటామని సంఘం జిల్లా నాయకురాలు రాజపుత్ర పార్వతీబాయి హెచ్చరించారు. గ్రామదీపికల నిరవదిక సమ్మె లో భాగంగా రెండో రోజు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలో బిక్షాటన చేస్తూ విన్నూత నిరసన కార్యక్రమం చేశారు. ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా మా హామీలు అమలు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 58 ను సవరించాలని కోరారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని. రూ.26 వేల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీ ని నేటి వరకు అమలు కావటం లేదని అగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వంతో పోరాడాతామని, నిరసనలు దశల వారీగా చేపట్టనున్నట్లు తెలిపారు. చాలీచాలనీ వేతనాలు,సమస్యలు పరిష్కారం చేయకుంటే బిక్షం ఎత్తుకుని విధులు నిర్వహించాలా ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంతో గ్రామదీపికల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇసుక వేలం పాటను సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న ఇసుక వేలం పాట ను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన చాంబర్ లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో వివిధ ప్రాంతాలలో అక్రమంగా తరులుతున్న ఇసుక ను సీజ్ చేశారు. మొత్తం 23 క్యూబిక్ మీటర్ల ఇసుక ను స్థానిక తహశీల్దార్ కార్యాలయం లో సీజ్ చేసినట్లు తెలిపారు. ఆ ఇసుక ను మైనింగ్ అండ్ జియోలాజీ అసిస్టెంట్ డైరెక్టర్ ఉత్తర్వులు ప్రకారం ఈ నెల 30 న వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్యూబిక్ మీటర్ రూ.642 కు వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.14.766 డిపాజిట్ చేసి వేలం పాటలో "పాల్గోనాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రాని పక్షంలో "వేలం పాట ను రద్దు చేసే అధికారం ఉందని పేర్కొన్నారు. వేలం పాట లో ఇసుక ను దక్కించుకున్న వారు వెంటనే మొత్తం డబ్బు ను చెల్లించాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ కనకం నరసింహారావు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్స్ ఆలస్యం మధుసూధనరావు, అల్లం రవికుమార్ లు ఉన్నారు.

## దాహార్తిని తీరుస్తున్న ఓ దాత



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండుతున్న ఎండల్లో దాహంతో అలమటిస్తున్న ప్రజలకు చల్లని మినరల్ నీటిని అందిస్తూ అశ్వాపురంలో ఓ తెలియని దాత మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు. పట్టణంలోని బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, మీ సేవ కేంద్రాలు, ఆధార్ సెంటర్ల వద్ద ప్రత్యేకంగా చల్లని నీటి క్యాన్లు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్నారు. రోజంతా ఎండలో తిరిగే బాటసారులు, వృద్ధులు, మహిళలు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఈ సేవతో ఉపశమనం పొందుతున్నారు. ఎలాంటి ప్రచారం లేకుండా సేవ చేయడం ఆ దాత గొప్ప మనసుకు నిదర్శనమని స్థానికులు ప్రశంసిస్తున్నారు. దాహాన్ని తీర్చడం కన్నా గొప్పదానం లేదు అన్న మాటను నిజం చేస్తూ, పేరు చెప్పుకోకుండా సేవ చేస్తున్న ఆ కుటుంబం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మండుతున్న వేసవిలో ఈ సేవ మరెందరికో స్ఫూర్తిగా మారాలని కోరుతున్నారు.

## పంచాయితీ సమస్యలను నా దృష్టికి తీసుకురండి : సర్పంచ్



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండలం రేపల్లెవాడ గ్రామంలో గత కొంత కాలంగా నెలకొన్న విద్యుత్ వోల్టేజ్ సమస్యకు గ్రామ సర్పంచ్ ఇర్పా స్రవంతి చొరవతో పరిష్కారం లభించింది. సంబంధిత విద్యుత్ అధికారులతో మాట్లాడి గ్రామంలో అదనంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన సర్పంచ్ స్రవంతి, పంచాయితీ పరిధిలోని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు. సమస్య పరిష్కారంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, లైన్‌మెన్ చంద్రశేఖర్, గ్రామ పెద్దలు సత్తి నాగేశ్వరరావు, మార్తి సత్యనారాయణ, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## మాదారం గ్రామానికి రూ. 19లక్షల డ్రైనేజీ నిధులు మంజూరు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండల పరిధిలోని మాదారం గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సైడ్ కాలువ(సీసీ డ్రైనేజీ)నిర్మాణానికి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. వైరా ఎంఎల్ఏ రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవతో గ్రామంలోని చర్చి నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు డ్రైనేజీ నిర్మాణానికి మొత్తం రూ 19లక్షల నిధులు మంజూరయ్యాయి. సమాచారం ప్రకారం ఎంపీడీఓ కార్యాలయం నుంచి రూ 4లక్షలు, జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి రూ 15లక్షలు కేటాయించగా, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. దశాబ్దాలుగా డ్రైనేజీ సమస్యతో గ్రామ ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ఈ నిధుల మంజూరుతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. గ్రామ సర్పంచ్ అజ్మీరా ఉమ నరేష్ నిరంతరం అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి నిధులు మంజూరుకు కృషి చేయడంతో ఈ అభివృద్ధి సాధ్యమైందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలు ఎంఎల్ఏ రాందాస్ నాయక్‌కు, సర్పంచ్ అజ్మీరా ఉమ నరేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ గ్రామాభివృద్ధికి వారి సేవలు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు.

## తండ్రి ఆశయాలే నా మార్గదర్శకాలు

### -కార్యకర్తల అండతో వైరాలో బీఆర్ఎస్ బలోపేతం చేస్తా

### -మనిషా లక్ష్మీ





**ప్రజాపక్షం/కారేపల్లి:** వైరా మాజీ ఎంఎల్ఏ దివంగత భానోత్ మదన్ లాల్ ఆశయాలను కొనసాగించడమే తన రాజకీయ ప్రవేశ లక్ష్యమని ఆయన కుమార్తె, బీఆర్ఎస్ నాయకురాలు మనిషా లక్ష్మి అన్నారు. శనివారం కారేపల్లి మండలంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆమె నా తండ్రి ప్రజల కోసం, రైతుల కోసం చివరి శ్వాస వరకు పోరాడారని, ఆయన నమ్మిన కార్యకర్తలను కాపాడుకోవడం నా బాధ్యత అని భావోద్వేగంగా అన్నారు. వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసి, పార్టీ జెండా ఎగురే వరకు విశ్రాంతి తీసుకోనని స్పష్టం చేశారు. నాన్నను విశ్వసించిన ప్రతి కార్యర్త నా కుటుంబ సభ్యుడే, వారి గౌరవం, భవిష్యత్తు కోసం నేను ఎప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. మదన్ లాల్ హయాంలో వైరాలో అభివృద్ధి వేగంగా జరిగిందని, రైతులకు అండగా నిలిచిన నాయకుడు ఆయనేనని గుర్తు చేశారు. ఈసమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మదన్ లాల్ సేవలను స్మరించుకున్నారు.

# నిర్ణీత గడువులోగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ**



**ప్రజాపక్షం/ తల్లాడ :** నిర్ణీత గడువులోగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. శనివారం తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లక్ష్యాలు, గ్రామపంచాయతీ అభివృద్ధి పనుల అమలు తీరుపై వివరంగా సమీక్షించారు. జల్‌సంచాయి జన్ భగీదరి అనే కేంద్ర ప్రభుత్వ పథకం లక్ష్యమైన జల సంరక్షణ పొదుపు ప్రజల భాగస్వామ్యం ప్రాముఖ్యతను వివరించి లక్ష్యాలను నిర్ధేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం, వీధిదీపాలు, మంచినీటి సరఫరా, వేస్ట్ టు హెల్త్ సెంటర్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి పనికి సంబంధించిన ఫోటోలను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, ఫీల్డ్ విజిట్లు పెంచాలని, లబ్ధిదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ శ్రీధర్‌రాజు, ఎపిఓ కల్లూరు చలపతిరావు, పిఆర్ ఇఇ భగీరథ, సిందూ, హౌజింగ్ ఎఇ అస్మా, ఎపిఎం రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పంట అవశేషాలను కాల్చవద్దు

**-పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారం కాపాడాలి**
**-నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపుతప్పి పక్కన ఉన్న పంటలు, ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. పంట అవశేషాలను కాల్చవద్దని సూచించారు. ఖమ్మం జిల్లాలో పంట కోత అనంతరం అవశేషాలు విస్తృతంగా కాలుస్తున్న ఘటనలు గమనిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.



నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పంట అవశేషాలను కాల్చినప్పుడు హానీకరమైన వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని దీని వల్ల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని, పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. పంట అవశేషాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కార్బనం, నత్రజని, ఫాస్పరస్, పోటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గుతుందన్నారు. దీని ఫలితంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడడంతో పాటు ఖర్చులు పెరిగి దిగుబడులు తగ్గుతాయన్నారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా రోటోవేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మి కంపోస్ట్ తయారు చేయడం, పశుగ్రాసంగా వినియోగించడం మల్చింగ్ పద్ధతులు అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంభించాలని కలెక్టర్ సూచించారు.

# ఉపాధి కూలీలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఉపాధి హామీ కూలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్. శనివారం వేంసూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. సుమారు 200 మంది కూలీలు పనిచేస్తున్న ప్రదేశాన్ని స్థానిక సర్పంచ్ ఫక్రుద్దీన్, తహశీల్దార్, ఎంపీడీఓలతో కలిసి సందర్శించిన ఎమ్మెల్యే, కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు, పని పరిస్థితులు, బ్యాంక్ ఖాతాల్లో వేతనాల జమలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేసి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఎండలను లెక్కచేయకుండా పనిచేస్తున్న కూలీల పట్ల మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే, వారికి మెడికల్ కిట్లు , మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం కూలీలతో కలిసి కూర్చుని టిఫిన్ చేసి, స్వయంగా వడ్డించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చర్యతో కూలీల్లో ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అర్హులైన వారికి త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తదుపరి వేంసూరు గ్రామానికి చెందిన మోరంపూడి భాస్కరరావు నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే, ఆయన సతీమణి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆసుపత్రి కార్మికుల జిల్లా మహాసభను జయప్రదం చేయండి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/కల్లూరు:** ఈనెల 25 సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి కల్లూరు లోని విజ్ఞాన్ పాఠశాలలో జిల్లా ఆసుపత్రుల కార్మికుల సంఘం మహాసభ జరుగుతుందని వేము రాంబాబు తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతీయ వైద్యశాలలలో పనిచేస్తున్న పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్ , శానిటేషన్ వర్కర్లు , కనీస వేతనం చట్టం అమలు చేయాలని చట్ట ప్రకారం నాలుగు పండుగ సెలవులు నాలుగు జాతీయ సెలవులు 20 రోజులకు ఒకటి చొప్పున 23 ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని, రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, కార్మికులకు నాన్ ప్రాఫిట్ బోనస్ కింద ఒక నెల జీతం ఇవ్వాలని, కార్మికుల సమస్యలపై ఈ మహాసభల్లో తీర్మానం చేయడం జరుగుతుందని మహాసభకు ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ హాజరు కానున్నట్లు వారితో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, పలువురు నాయకులు హాజరు కానున్నట్లు వేము రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి కార్మికులందరూ జయప్రదం చేయాలని కోరారు.

## నిబద్ధత గల నాయకుడు లక్ష్మీనర్సయ్య

**బొంతు రాంబాబు**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్లలో సిపిఎం సీనియర్ నాయకులు యాసా లక్ష్మీ నర్సయ్య 6వ వర్థంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఎం గ్రామశాఖ అధ్యక్షుడు యాసా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు మాట్లాడుతు లక్ష్మీ నర్సయ్య నిబద్ధత గల నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలను సాధించేందుకు నేటి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామంలో సిపిఎం అభివృద్ధికి ఆయన ఎంతో కృషిచేశారని పేర్కొన్నారు. గ్రామంలోని మరో సిపిఎం నాయకులు పెదమళ్ల అప్పారావు స్థూపానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం పూలమాలవేసి ఆయన 26వ వర్థంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటి సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, పార్టీ మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్, చల్లా నారాయణ, చింతనిప్పు సూర్యం, యాసా ప్రభాకర్‌రావు, యాసా తిలక్, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, పివిరావు, రిటైర్డ్ టీచర్లు కొణపర్తి విష్ణుమూర్తి, యాసా సత్యనారాయణ, ఎస్‌టియు నాయకులు లేడిబోయిన గోపాల్‌రావు, జోనెబోయిన నరసింహారావు, పెదమళ్ల అప్పారావు సతీమణి పెదమళ్ల పద్మినీతిలకం తదితరులు పాల్గొన్నారు.

# ఐకెపి సిబ్బంది వినూత్న నిరసన



**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల కేంద్రంలో రెండవరోజు ఐకెపి సిబ్బంది కళ్లకు గంతలు కట్టి వినూత్నంగా నిరసనకు దిగారు. చాలిచాలనీ జీతాలతో ఏళ్ల తరబడి పనిచేస్తూ మా కుటుంబాలను అంధకారంలో పడేశామని, కనీస కుటుంబ అవసరాలు కూడా తీర్చుకోలేని దుస్థితిలో జీవితాలు ఆవిరైపోతున్నాయని మీడియా ముందు వారు వాపోయారు. తల్లాడ మండల కేంద్రంలో రెండు రోజలుగా ఐకెపి సిబ్బంది దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పలు అంశాలపై సత్వర పరిష్కారం కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న సంగతి విధతమే. శనివారం ఈ దీక్షా శిబిరాన్ని సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయబద్ధమైన డిమాండ్లు తీర్చడం సరైందని, దీనికి మావంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు నల్లమోతు మోహన్‌రావు, కొమ్మినేని రాంబాబు, పేరసాని వెంకటయ్య, శివలంక వెంకటనర్సయ్య, అన్ని గ్రామాల వివోఏలు, మహిళా సంఘాల కార్యకర్తలు, ప్రతినిధులు, డ్వాక్రా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు రాకేష్ దత్తా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ రాకేష్ దత్తా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గల ధర్నాచౌక్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాకేష్ దత్తా మాట్లాడుతూ విద్యార్థులపై ప్రభుత్వ నిర్లక్ష వైఖరి సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.10 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ దీక్షకు జాతీయ బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డా॥ ర్యాగా అరుణ్, ప్రముఖ వైద్యులు గొంగూర వెంకటేశ్వర్లు, మోత్కూరి నారాయణరావు, బక్క జడ్సన్, వేముల రామకృష్ణ తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నగర అధ్యక్షులు గోనే శ్రీశ్రీ, ఎండి ఠాగూర్, జయంత్ యాదవ్, హరి యాదవ్, చింతల రోహిత్, బాషబోయిన ఉపేందర్, కె. ప్రవీణ్, ఎం. మనోజ్, శేఖర్, సైదులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కోయచలక గ్రామంలో దొంగతనం

**-10 తులాల బంగారం చోరీ**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడి 10 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని కోయచకల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన పెరుమాళ్లపల్లి విజయ్ శేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 19న కొణిజర్ల మండలంలో బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 11 గంటల సమయంలో బంధువులు విజయ్ శేఖర్ ఇంటికి వచ్చి చూడగా తలుపు తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి విజయ్ శేఖర్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న విజయ్ శేఖర్ ఇంటికి వచ్చి చూడగా బీరువా తాళాలు కూడా పగలగొట్టి అందులో ఉన్న తొమ్మిది తులాల బంగారాన్ని, అదేవిధంగా పక్కనే ఉన్న విజయ్ శేఖర్ సోదరుడు అశోక్ ఇంట్లో కూడా దొంగలు జొరబడి బీరువాలో ఉన్న తులం బంగారంతో సహా మొత్తం 10 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. గత నాలుగు రోజులుగా ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఈ దొంగతనం ఎప్పుడు జరిగింది అనేది తెలియాల్సి ఉంది. ఘటన స్థలాన్ని రఘునాథపాలెం ఎస్ఐ నరేష్ సందర్శించి దొంగతనానికి సంబంధించి వివరాలు సేకరించారు. చుట్టు పక్కల పరిసరాలను పరిశీలించారు. విజయ్ శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రెండో రోజుకు చేరిన గ్రామ దీపికల సమ్మె



**ప్రజాపక్షం/వైరా:** వైరా రింగు రోడ్డు వద్ద గ్రామదీపికలు సమస్యలు పరిష్కరించాలంటూ చేపట్టిన రిలే నిరహార దీక్ష రెండో రోజుకి చేరుకుంది. గ్రామదీపికల వేతనాలు పెంపుదలతో పాటు ఉద్యోగ భద్రత కూడా కల్పించాలని దీక్ష చేపట్టడం జరిగింది. గ్రామదీపికలకు వేతనం పెంచి ప్రభుత్వం వారిని ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రతి గారమంలో గ్రామదీపికలు మహిళా సమైక్యాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రభుత్వ పథకాలను సైతం ప్రజలకు వివరిస్తున్నారని, గ్రామదీపికల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని, వేతనం పెంచాలని అన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల విషయంలో గ్రామదీపికలు పూర్తిస్థాయిలో ఆ పథకాల అమలును ప్రజలకు వివరించడంలో, ముందున్నారని విషయాన్ని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గద్దె నీరజ, పద్మావతి, శైలజ, నిర్మల, మమత, తేజ, ప్రభావతి, రమాదేవి, రాధా, మణి, మల్లేశ్వరి, విజయలక్ష్మి , స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# ఏసిపి సారంగపాణిని కలిసిన కాపా




**ప్రజాపక్షం/వైరా:** వైరా ఏసిపి సారంగపాణిని మర్యాదపూర్వకంగా కలిసిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ హెల్త్ అండ్ మెడికల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, లయన్ ఐ కేర్ హాస్పిటల్ నిర్వాహకులు వుండ్రు శ్యామ్‌బాబు, తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరి రామకృష్ణ ఈ సందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణ, వుండ్రు శ్యామ్‌బాబు, వైరా ఎస్సై పుప్పాల రామారావుతో కలిసి ఏసిపి సారంగపాణికి శాలువాతో సన్మానించారు.

# బ్రిడ్జి నిర్మాణం సీతంపేట-రాఘవాపురం గ్రామీణుల చిరకాల వాంఛ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సీతంపేటరాఘవాపురం గ్రామీణుల చిరకాల వాంఛ అయిన బ్రిడ్జి నిర్మాణాన్ని నెరవేరుస్తున్నామని, బ్రిడ్జి నిర్మాణం ప్రాధాన్యతను గుర్తించి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించడం జరిగిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ మండల పరిధిలో రూ.5.54 కోట్ల నిధులకు సంబంధించి శనివారం ఆయ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ రూ.4.75 కోట్ల భారీ అంచనా వ్యయంతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అలాగే రూ.34 లక్షలతో రెడ్డిపాలెం సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి విజయవంతంగా అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. రూ.45 లక్షలతో అత్యాధునిక వసతులతో నిర్మించిన ఎంఆర్సీ భవనాన్ని కూడా ఈ రోజు ప్రారంభించడం సంతోషంగా ఉందని, మండలంలో విద్యాసంబంధిత సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయన్నారు. వేపలగడ్డ స్మశానవాటికలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రెండు బోర్లు మంజూరు చేయడం జరిగిందని, వాటి శంకుస్థాపన పూర్తిచేశామన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల

## నిరంతరం ప్రజల చెంతనే ఉంటాం : ఎమ్మెల్యే కూనంనేని



పరిష్కారమే లక్ష్యంగా తాము నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులను మంజూరు చేయించి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పనుల నాణ్యతలో రాజీ పడకుండా సకాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర పాషా, కొత్తగూడెం కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, తహశీల్ధార్ వి.వరప్రసాద్, ఎంపీడీఓ భారతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గుప్తా, విద్యుత్ ఏఈ జి.కిషన్, ఏడిఈ రవికుమార్, సిఐ వెంకటేశ్వర్, పిఆర్ ఏఈ రాజు, డిఈ నాగేందర్ ఎంఈఓ లీలా, ఎస్ఐ రమాదేవి, హన్మంతరావు, వ్యవసాయశాఖ అధికారి నర్మద, స్థానిక నయకులు భూక్యా దస్రు, కొమారి హన్మతరావు, జక్కుల రాములు, ఉపేందర్, భూక్యా శ్రీనివాస్, గుమ్మడిల్లి దర్గయ్య, బొడ్డు కేశవరావు, గారికె ఉపేందర్, నరేష్, ముక్కెర మురళి, దండు సురేష్, లావుడియా గోపి తదితరులు పాల్గొన్నారు.

# మండుతున్న ఎండలతో ఆకాశం నుంచే రాలిపడుతున్న పక్షులు..!



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండుతున్న ఎండలు ఇప్పుడు మూగ జీవాల ప్రాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అన్నపురెడ్డిపల్లి మండలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పక్షులు ఆకాశం నుంచే కిందపడిపోతున్న ఘటనలు స్థానికులను కలవరపెడుతున్నాయి. గత కొన్ని రోజులుగా మండలంలో 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, వేడి గాలులు, నీటి కొరత, చెట్ల తగ్గుదలతో పక్షులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గ్రామాల్లోని చెట్ల కింద, ఇళ్ల ముందర, పొలాల వద్ద అలసిపోయి పడిపోయిన పిచ్చుకలు, కాకులు కనిపిస్తున్నాయి. కొన్ని పక్షులు నీళ్లు తాగి కోలుకుంటుండగా, మరికొన్ని ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. మధ్యాహ్నం వేళ పక్షులు ఎగరలేక కింద పడిపోతున్నాయి అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వేడి కారణంగా చిన్న పక్షుల్లో డీహైడ్రేషన్ తీవ్రంగా పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. నీటి వనరులు ఎండిపోవడం, చెట్లను నరికివేయడం పరిస్థితిని మరింత విషమం చేస్తోందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఇళ్ల ముందు చిన్న పాత్రల్లో నీళ్లు ఉంచాలని, పక్షులకు ధాన్యం వేయాలని, చెట్లను సంరక్షించాలని కోరుతున్నారు. గ్రామాల్లో బర్డ్ వాటర్ పాయింట్స్ ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. మండుతున్న వేసవి కేవలం మనుషులకే కాదు, మూగ జీవాల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతోందని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రామ పెద్దలు, స్థానికులు పిలుపునిస్తున్నారు.

# కమ్యూనిస్టు పార్టీ విస్తరణలో దుర్గా రమేష్ పాత్ర కీలకం

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం ప్రాంతంలో భారతకమ్యూనిస్టు పార్టీ విస్తరణలో వాతాడి దుర్గా రమేష్ పాత్ర ఎంతో కీలకంగా నిలిచిందని, ఆయన మరణించి 14 సం. అవుతున్నా ప్రజల గుండెల్లో సుస్థిరంగా ఉన్నారని సిపిఐ డివిజన్ కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో వాతాడి దుర్గా రమేష్ 14వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కల్లూరి మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, సిపిఐ నాయకునిగా చురుకైన పాత్ర పోషించారని చెప్పారు. విద్యారంగ సమస్యలు, యువజన రంగ సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని చెప్పారు. నిత్యం గిరిజన గ్రామాల్లో పర్యటిస్తూ తన కంటు ప్రజల్లో చెరగమని ముద్రను వేసుకున్నారని చెప్పారు. ఆయన



ప్రస్తుతం మన మధ్య లేకున్నా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా ఉన్నాయని, ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు వాతాడి దుర్గారావు, భాస్కర్ రావు, మారెడ్డి శివాజీ, నర్సింహమూర్తి, బచ్చు శ్రీనివాస్, పట్టణ ఏఐవైఎఫ్ నాయకులు సాధనపల్లి సతీష్, కొక్కిరేణి అశోక్ కుమార్, నారపోగు ఏసు, పసుపులేటి సాయి, కుమారి, మహ్మద్ వలీ, దాసరి శేఖర్, సీతారామరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో ఒకరు అరెస్ట్

## -బంగారం, వెండి వస్తువులు స్వాధీనం

**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఈనెల 10న అశ్వాపురం ఎస్సీ కాలనీకి చెందిన నల్లగట్ల ప్రశాంత్ బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఆయన ఇంట్లో చోరీ జరిగింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో అశ్వాపురం ఎస్సీ కాలనీకి చెందిన రాగం అశోక్, ఇసంపల్లి జంపయ్య ఈ చోరీకి పాల్పడినట్లు తేలింది. శనివారం నిందితుడు రాగం అశోక్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 35 గ్రాముల బంగారం వస్తువులు, 206 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడేఉ ఇసంపల్లి జంపయ్య పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు ఊరికి వెళ్లే ముందు విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని, ఇళ్లలో సీసీ కెమోరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# మల్లెల రామయ్యకు నివాళి

**ప్రజాపక్షం/మణుగూరుః**



మణుగూరు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు మల్లెల రామ నరసయ్య సోదరుడు మల్లెల రామయ్య దినకర్మ శనివారం గుట్ట మల్లారంలోని బోడపూడి నగర్ లో తన స్వగ్రామంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, సిపిఐపట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజ బాబు, సీనియర్ నాయకులు ఎస్ కే సర్వర్, మంగి వీరయ్య, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు తోట రమేష్, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లెల రామ్ నర్సయ్య, గోపిశెట్టి శివయ్య, కందిమల్ల రామయ్య, ఆధర్ల సురేందర్, ఇమాముద్దీన్, తేనేటి నారాయణ, ప్రవీణ్, నాగరాజు, రంజిత్, ఆఫీస్ బేరర్స్ పెద్ద ఎత్తున పాల్గొని పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

# అస్వస్థతకు గురైన గ్రామదీపిక..!

## దీక్ష శిభిరంలో వడదెబ్బకు పడిపోయిన వైనం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రామదీపికల నిరవదిక సమ్మెలో పాల్గొన్న గ్రామదీపిక అస్వస్థతకు గురైయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల కేంద్రంలో తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ గ్రామదీపికలు నిరవదిక సమ్మె ను చేపట్టారు. ఈ సమ్మె లో పాల్గొన్న గువ్వలగూడెం కు చెందిన గ్రామదీపిక మరియమ్మ శిభిరంలో ఒక్కసారిగా పడిపోయింది. పెరిగిన ఎండ తీవ్రతను తట్టుకోలేక అస్వస్థతకు గురి కావటంతో సహాచర గ్రామదీపికలు వెంటనే హస్పిటల్ కు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఆమె తో పాటు మరో ముగ్గురు ఎండ తీవ్రత వలన వడదెబ్బతో అస్వస్థత కు గురైనప్పటకీ శిభిరంలో నిరవదిక సమ్మె ను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ప్రాణాలు పోయిన ఆందోళన మాత్రం విరమించేది లేదని హెచ్చరించారు.

# మొక్కజొన్న నిల్వలు వెంటనే తరలించాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి :** ఆళ్లపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో 117మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వ ఉండటంపై స్పందిస్తూ వెంటనే గోదాములకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి సకాలంలో కొనుగోలు చేసి, లోడింగ్ రవాణా ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో మొక్కజొన్న తడవకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని, రైతులకు తాగునీరు. నీడ, కూర్చునే సదుపాయాలు కల్పించాలని తెలిపారు. అనంతరం ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి కలెక్టర్, మెడికల్ అధికారి తరుణ్ అందుబాటులో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది తప్పని సరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వడదెబ్బ బాధితులకు అవసరమైన మందులు, ఐవీ ఫ్లూయిడ్స్, పడకలు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ ఉషారాణి, ఆరోగ్య శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వైద్య పరీక్షలకు వెళ్తూ విషాదం

## -ఆటో ప్రమాదంలో ఒకే కుటుంబానికి తీవ్ర గాయాలు

## -కొడుకు పరిస్థితి విషమం, కుటుంబాన్ని కలచివేసిన ఘటన



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఆరోగ్య సమస్యతో ఆస్పత్రికి వెళ్తున్న ఓ కుటుంబాన్ని విధి మరోసారి దారుణంగా పరీక్షించింది. వైద్య పరీక్షలు చేయించుకునేందుకు బయలుదేరిన తండ్రి, తల్లి, కుమారుడు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడిన విషాద ఘటన శనివారం బూర్గంపాడు మండల పరిధిలోని కోయగూడెం సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం కరకగూడెంకు చెందిన ఆడెపు సతీష్ గతంలో తలకు శస్త్రచికిత్స చేయించుకుని చిప్ప అమర్చించుకున్నాడు. ఆరోగ్య పరిస్థితిని పరీక్షించుకునేందుకు భార్య స్వప్న, కుమారుడు మనోహర్‌తో కలిసి భద్రాచలం ప్రైవేట్ ఆస్పత్రికి ఆటోలో బయలుదేరాడు. కోయగూడెం సమీపానికి రాగానే ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయిన డ్రైవర్ ఆటోపై నియంత్రణ కోల్పోయి రహదారి పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. సతీష్, స్వప్నలకు భద్రాచలంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతుండగా, కుమారుడు మనోహర్ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఇప్పటికే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సతీష్ మరోసారి ప్రమాదారికి గురికావడం, అదే సమయంలో భార్య, కుమారుడు కూడా గాయపడటం కుటుంబ సభ్యులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. ఆస్పత్రికి ఆరోగ్యం కోసం వెళ్తే ప్రమాదం ఎదురైంది అంటూ గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

**ప్రజాపక్షం/జూలూరుపాడుః** ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన ప్రతి గింజ కొంటామని చెప్పి, సన్నాలకు బోనస్ ప్రకటించి కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని కొనకుండా రైతులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసి, రైతులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఉసికల రమేష్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధి నర్సాపురంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సుమారు 2000 బస్తాల వరి ధాన్యాన్ని రైతులు మద్దతు ధర లభిస్తుందని ఆశతో తీసుకువస్తే, అధికారులు అనేక రకాల నాణ్యత ప్రమాణాలు పరీక్షలు నిర్వహించి, ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా వదిలేసారని తెలిపారు. అకాల వర్షాల భయంతో చేసేదేమీ లేక రైతులు ప్రైవేట్ వ్యక్తులకు బస్తా 1300 చొప్పున నష్టాలకు అమ్మవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,389, కామన్ గ్రేడ్ కు రూ. 2,359 మద్దతు ధరతో పాటు సన్నాలకు రూ. 500 బోనస్ అంటూ ప్రకటనలతో రైతులను ప్రలోభ పెట్టి ఆఖరికి కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని కొనకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. ఎద్దేడ్చిన ఎగుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్లు చరిత్రలో లేదని, ఇకనైనా ప్రభుత్వం రైతుల పట్ల నిబద్ధతతో నిజాయితీగా వ్యవహరించాలని ఉసికల రమేష్ కోరారు.

# వివోఏల కనీస వేతన చట్టం అమలు చేయాలి

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** వివోఏలకు కనీస వేతన చట్టం అమలు చేయాలని వివోఏ(ఐకెపి)జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. శనివారం చంద్రుగొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వివోఏల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈసందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ వివోఏలకు కనీస వేతనం ఇవ్వాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. ప్రమాదభీమా సౌకర్యం కల్పించడంతో పాటు, ప్రమోషన్లు సిసిలుగా ఇవ్వాలన్నారు. ఈ నిరసన దీక్షలో సంఘం మండల కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధి, రవాణా సౌకర్యానికి పెద్దపీట

-రవాణా కష్టాల శాశ్వత పరిష్కారానికే సరికొత్త హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణాలు : ఎమ్మెల్యే కూనంనేని





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/చుంచుపల్లి : గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటిడిఏ నిధుల ద్వారా పెద్దపీట వేస్తున్నామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా చిట్టిరామవరం నుంచి చుంచుపల్లి రహదారిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి, అలాగే కొత్తగూడెం బైపాస్ రోడ్డు నుంచి పెనుబల్లి (గరిమెళ్ళపాడు) ప్రధాన రోడ్డుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పెనుబల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పిహెచ్‌సి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. ఈ బ్రిడ్జిల నిర్మాణంతో స్థానిక ప్రజల దశాబ్దాల రవాణా కష్టాలు తీరనున్నాయని, అత్యవసర సమయాల్లో వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా పెనుబల్లిలో అధునాతన ప్రాథమిక వైద్యశాల అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, అధికారులు ఎంపీడీఓ శుభాషిణి, తహశీల్దార్ నాగరాజు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు మధుకర్, శ్రీకాంత్, నాగేంద్ర, స్థానిక నాయకులు వాసిరెడ్డి మురళి, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, గోవిందు, సర్పంచి శాంతి శ్రీ, రెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరం

-యువత ప్రతిభకు అవకాశాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్
-జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందజేత



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువజన, క్రీడల అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాబ్‌మేళాకు ఎంపికైన 618 మంది అభ్యర్థులకు కలెక్టర్ ప్రొవిజినల్ ఆఫర్ లెటర్ అందజేశారు. అదేవిధంగా సిఎం కప్ 2026 రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన 72 మంది యువ క్రీడాకారులను సన్మానించారు. మొత్తం 433 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా గతంలో కుటుంబాల్లో క్రీడలకు అంతగా ప్రోత్సాహం ఉండేది కాదని ప్రస్తుతం సానియామీర్జా, తిలక్ వర్మ వంటి యువత క్రీడల్లో రాణిస్తూ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ప్రస్తుతం క్రికెట్ మాత్రమే కాకుండా యువత అనేక క్రీడల్లో ప్రతిభ కనబరుస్తుందని ఇటీవల ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అథ్లెటిక్స్ విభాగంలో పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతుందని ప్రముఖ ఇన్వెస్టర్ రాకేష్ ఝున్ ఝున్ వాలా సుమారు రూ. 50వేల కోట్లు సంపాద సంపాదించినప్పటికీ పలు ఆరోగ్య సమస్యలతో చిన్న వయస్సులోనే మరణించారని కలెక్టర్ తెలిపారు. తాను అన్ని చోట్ల పెట్టుబడులు పెట్టానని కానీ ఆరోగ్యంపై పెట్టుబడులు పెట్టలేదని ఆయన చెప్పిన మాటలను గుర్తు చేశారు. సంపాదన కంటే ఆరోగ్యం ముఖ్యమని ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని కలెక్టర్ తెలిపారు. శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా క్రీడలు అందిస్తాయన్నారు. ఖమ్మంజిల్లా క్రీడల్లో ఎప్పుడు ముందంజలో ఉంటుందని ఇక్కడ మంచి మౌలిక వసతులు, కోచ్‌లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ప్రతి ఒక్కరిలోనూ ప్రత్యేక ప్రతిభ ఉంటుందని వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని యువతకు సూచించారు. ఉద్యోగాలు సాధించిన యువతకు ఇది మొదటి అడుగు మాత్రమేనని కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని తెలిపారు. అదనపు కలెక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జాబ్‌మేళాలో ఎంపికైన యువతను, సిఎం కప్ పోటీల్లో విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్‌వో సునీల్‌రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి, కోచ్‌లు, క్రీడాకారులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నేడు టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా 3వ మహాసభ

- ఏర్పాట్లు పూర్తి
- తరలివస్తున్న ప్రముఖులు

TUWJ-IJU మహాసభ
Telangana State Union of Working Journalists



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ టియూడబ్ల్యూజే (ఐజేయు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభ నేడు జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో జరగనుంది. సభ నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్వాహక కమిటీ పూర్తి చేసింది. ఇప్పటికే రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి రామ్‌నారాయణతో పాటు పలువురు జిల్లా కేంద్రానికి చేరుకోవడంతో జిల్లా నాయత్వం వారికి స్వాగతం పలికింది. ఈ మహాసభ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకోనున్నారు. ఈ మహాసభకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రెస్ అకాడమి చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, ఎంపిలు రామసహాయం రఘురామిరెడ్డి, పోరిక బలరామ్ నాయక్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌ఏలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు,డా. తెల్లం వెంకట్రావు, రామ్‌దాస్ నాయక్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఈ మహాసభ వేదిక కానుంది.

# గీత కార్మికుల జీవనాధారమైన ఈత చెట్ల దహనం



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : కులవృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న గీత కార్మికుల ఈత చెట్లను అగ్నికి ఆహుతి చేసిన సంఘటన మండల పరిధిలోని దమ్మాయిగూడెం లో చోటుచేసుకుంది గీత కార్మికుల అధ్యక్షుడు బోడపట్ల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం గీత కార్మికులు ఏళ్ల తరబడి కులవృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న వారి జీవితాలపై చలగాటమాడుతూ ఉన్నారని ఇటీవల దమ్మాయిగూడెం గ్రామంలో కొందరు ఈత చెట్లను జెసిబి లతో తీసివేయగా ఇప్పుడు ఉపాధి హామీ పేరుతో కూలీలతో చెత్తను మూలకంపను తీయవలసిన కూలీలు నేరుగా నిప్పు అంటించడంతో ఈత చెట్లు అన్ని పూర్తిగా తగలబడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇట్టి విషయంపై పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా గ్రామపంచాయతీ సిబ్బందికి గాని ఉపాధామి కూలీల గాని ఎలాంటి సంబంధం లేదని పక్క రైతు తమ పంట అవశేషాలను కాల్చడం ద్వారా నిప్పు అంటుకొని ఈత చెట్లు కాలిపోయాయని దీనికి పంచాయతీ వారికి సంబంధం లేదని ఆయన వివరించారు.

# పేరసాని అప్పయ్య ఆశయాలు సాధించాలి

సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు



ప్రజాపక్షం/కొణిజర్ల : పేరసాని అప్పయ్య ఆశయాలు సాధించేందుకు ప్రతిఒక్కరు కృషిచేయాలని సిపిఐ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు అన్నారు. మండల పరిదిలోని తనికెళ్లలో సిపిఐ సీనియర్ నాయకులు పేరసాని అప్పయ్య వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతు తనికెళ్లలో గట్టుపంచాయతీకాని కుటుంబం పంచాయతీ కాని మరే సమస్యలనైనా పోలీస్‌స్టేషన్ మెట్లెక్కకుండా సున్నితంగా పరిష్కరించిన వ్యక్తి అప్పయ్య అని కొనియాడారు. గ్రామంలో పార్టీ అభివృద్ధికి ఆయన ఎంతో కృషిచేశారని అన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, తనికెళ్ల సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కొణపర్తి విష్ణుమూర్తి, ఎస్‌టీయు ఉపాధ్యాయసంఘం నాయకులు లేడిబోయిన గోపాల్‌రావు, పిన్నింపుల్లయ్య, గుమ్మడెల్లి వెంకటేశ్వర్లు, బాసా నాగరాజు, అప్పయ్య మనుమరాలు పేరసాని సుధాశివకుమారి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు అడ్డుకుంటే సహించేదిలేదు

మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి



ప్రజాపక్షం/కొణిజర్ల : అభివృద్ధి పనులను కొంతమంది నాయకులు అడ్డుకుంటున్నారని అభివృద్ధి పనులు అడ్డుకుంటే సహించేదిలేదని వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాణోత్ చంద్రావతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతు మండల కేంద్రం కొణిజర్ల నుంచి తుమ్మలపల్లి మీదుగా దనబండవరకు వెళ్లే రహదారిపై తుమ్మలపల్లి పగిదేరువాగుపై కల్వర్టు నిర్మాణపనులను కొంతమంది కావాలని అడ్డుకుంటున్నారని అభివృద్ధిలో పోటీపడాలి కాని అడ్డుకోవడం దారుణమని అన్నారు. ఈ కల్వర్టు పూర్తయితే రైతులు, కూలీలు, విద్యార్థులు గ్రామ ప్రజలకు అన్ని వర్గాలవారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. వర్షాకాలం వస్తే ఈ వాగుపై కల్వర్టు నిర్మాణం ఆలస్యం జరుగుతుందని వెంటనే నిర్మాణపనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు లోను కాకుండా కల్వర్టు నిర్మాణాన్ని తొందరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# రెండవ రోజుకు చేరిన విఓఏల ధర్నా



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండలంలో ఐకెపి పరిధిలో పనిచేస్తున్న విఓఏలు తమ పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ రెండవ రోజు శనివారం విఓఏ జాక్ ఆధ్వర్యంలో ఎర్రుపాలెం ఐకెపి కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెలో పాల్గొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జివో 363, 302జీవోల ప్రకారం అమలు చేయాల్సిన పలు అంశాలు ఇంకా అమలులోకి రాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విఓఏలకు సమాన వేతనాలు, పదోన్నతులు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. తమ ప్రధాన డిమాండ్లైన నెలకు రూ.20వేలు వేతనం అమలు చేయాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి అర్హులైన విఓఏలను సిసిలుగా ప్రమోట్ చేయాలని, రూ.20లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, జీవో 58ను సవరించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విఓఏల మండల అధ్యక్షులు పగడాల కనకదుర్గ, విఓఏలు శీలం కనకదుర్గ, కొత్తపల్లి రాణి, కోటా హేమలత, కోలా ఏడుకొండలు, పద్మ, జంగా నాగమణి, వేమిరెడ్డి సుజాత, రజిత, జరీనా, ప్రశాంతి, వరలక్ష్మీ, లావణ్య, కమల, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్వాంగాభిషేకం ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి అమ్మవార్లకు శనివారం పంచామృతాలతో సర్వాంగాభిషేకాలు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ముత్యాల అలంకార రూపంలో స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామి వారికి అమ్మ వార్లకు నిత్య కళ్యాణం ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం కావడంతో ఎండలను లెక్కచేయకుండా ఆలయానికి వేలాదిగా భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు. మహిళ భక్తులు పొంగళ్లు చేసి స్వామి వారికి నివేదన చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, ముఖ్య అర్చకులు ఎం.వెంకటరమణ, మురళీమోహన్‌శర్మ, రఘురామ కృష్ణశాస్త్రి, రాజీవ్‌శర్మ, చక్రధర్, రామకృష్ణ, వేదపండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల ఎంపిక

ప్రజాపక్షం/కల్లూరు: రేషన్ డీలర్ల ఎంపిక ప్రక్రియ పూర్తయినట్లు కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తెలిపారు. ఏప్రిల్ నెలలో రేషన్ డీలర్లకు రాత పరీక్ష ఆధారంగా అర్హత కలిగిన పేర్లను ఎంపిక చేసి వారికి నిర్వహణకు ఆధార్ పత్రాలను అందజేసినట్లు పేర్కొన్నారు. సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు, తల్లాడ , ఏన్కూరు మండలాలకు చెందిన ఆయా గ్రామాలలో ఆరు ఖాళీలకు నిర్వహించిన పరీక్షలకు ఆధారంగా అర్హత ఫలితాలను విడుదల చేశారు. ఇకనుంచి ఎంపికైన వారు ఆయా గ్రామాలలో రేషన్ డీలర్ల నిర్వహణ జరుగుతుందని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు.